
# ఈ కథ కొత్తదేం కాదు




"అరే! . . . లల్లీ! నా బాగ్ మరిచిపోయానే! పరిగెత్తుకెళ్లి కొంచెం తెచ్చిపెట్టు!"

ఫ్రాక్ దూదిపింజెల్లా మెత్తగా గాలికి ఎగురుతూంటే లల్లి వెనక్కు పరిగెత్తుకు వెళ్లింది.

ఆమె లల్లీకోసం ఎదురుచూస్తూ అలాగే నిలబడింది.

కొంచెం ఎత్తయిన మనిషి. ఇరవై అయిదేళ్లుండవచ్చు. దబ్బపండులాంటిరంగు. చక్కని సౌష్ఠవం కల శరీరం. పొడిపొడిగా ఉన్న జుట్టు. పట్టుగూడులా ఎత్తుగా ఉంది. ముందు కత్తిరించిన వెంట్రుకలు నుదుటిమీద చెదురు చెదురుగా ఉన్నాయి. గులాబీ రంగు బొట్టు పెట్టుకుంది. అదేరంగు లిప్‌స్టిక్ పెదవులకు రాసుకుంది. అదేరంగు పాలిష్ కాలిగోళ్లకూ చేతిగోళ్లకూ వేసుకుంది. బుగ్గలు కొంచెం కందినట్లు ఎర్రగా ఉన్నాయి. కళ్లకాటుక చివర పొట్టిగా చీలినట్లు దిద్దింది. పొడవైన మెడ. మెడలో ముందు ముడివేసిన ముత్యాలహారం వక్షంమీంచి ఎత్తుగా వచ్చి కింద దేనికీ ఆనలేక వ్రేలాడుతూంది. గంధం రంగు చేతులులేని రవిక. అదేరంగు చీర. పైట సగం వక్షాన్నే కప్పి భుజందాటగానే తాడులా ఆమె ఎడమచేతికి చుట్టుకుపోయింది. మెడ బాగా కిందికి కత్తిరించిన రవికలోనించి హృదయ సౌందర్యం కొంత బహిర్గతం అవుతూంది. పొట్టిగా ఉన్న రవిక క్రిందనే మృదువైన చర్మం మడత పడీపడనట్లుగా వంగిఉంది. ఊడిపోతుందేమో ననిపించేటట్లు వదులుగా కట్టిన చీర ఇస్త్రీ మడతలు చెరగకుండా ఉంది. వెనక చీరకట్టులో నించి లోపలి లంగా బొందుల చివరలు పైకి కనబడుతున్నాయి. కాళ్లకు హైహీల్సు. ఎడంచేతికి నల్లని బెల్టు ఉన్న స్క్వేర్ రిస్ట్‌వాచ్. కుడిచేతికి రాళ్లు పొదిగిన ఒకటే గాజు. చెవులకు గులాబీరంగు లోలకులు. ఆమె లల్లీకోసం ఎదురుచూడడంలో అడుగులు ఇటూ అటూ వేస్తూ ఓరచూపులతో నాలుగు వైపుల చూస్తూంది.

లల్లి బాగ్ తీసుకొని వచ్చింది. అదికూడా ఆమె చీర రంగుకు సరిపోతూంది.

ఆమె లల్లిచేతిలో బాగ్ తీసుకుని ఒయ్యారంగా నడిచిపోయింది, పక్కనే లల్లి పరిగెడుతూన్నట్లు నడుస్తూంటే.

అంతవరకూ ఎంతో ఉత్సాహంతో ముందుకు వంగి చూసిన కృష్ణవేణి ఈజీఛైర్‌లో వెనక్కివాలింది.

ఆ సుందరి కృష్ణవేణి కళ్లముందు నుంచి కదిలిపోయినా ఇంకా కనబడుతూంది ఆమె మూసిన కళ్లకు.

కృష్ణవేణి ఉన్నట్లుండి తల పక్కకు తిప్పి బీరువాకు బిగించిన అద్దంలో చూసింది. ప్రతిబింబం కనబడటం లేదు. కాలివేళ్లు నేలకానించి కుర్చీని వెనక్కుతోసింది.

తలంటిపోసుకోవడం వల్ల జుట్టు వదులుగాముఖాన్ని పక్కలలో కప్పుతూంది. తీర్చిదిద్దినట్లున్న కనుబొమలు. కనుబొమలకు కొంచెం దగ్గిరగా ఉన్న ఎర్రని కుంకుమబొట్టు. తెల్లని పెద్ద కళ్లు. నల్లని సన్నని కాటుక. చిన్న ముక్కు. సంతృప్తిని చాటుతూ కొంచెం సాగిన పెదవులు. చిన్న చుబుకం.

కృష్ణవేణి కుర్చీని మరికొంచెం వెనక్కుతోసింది. పలక రంగు చీరలో. అదేరంగు రైకలో తిరుగుబాటు చేస్తూన్నట్లున్న ఆరోగ్యమైన శరీరం. అయితే దుస్తులకు సరిపోయే శరీరవర్ణం. పొడవైన జడ వేలాడి నేలకు తగులుతూంది.

"తానుకూడా అందంగానే ఉందా? అందంగానే ఉందేమో! అయినా అందం అనేది ఒకరు చెప్పగలిగేదా! జిహ్వాకోరుచి. కంటికో అందం. అందరి కళ్లకీ ఒకర్తె అందంగా కనబడితే ఇంకేమైనా ఉందా!"

కృష్ణవేణి టేబిల్ మీద ఉన్న కవరు వైపు చూసింది. అందులో నీలిరంగు కాగితం బయటకు తీసి మరో సారి చదివింది.

"డియర్ కృష్ణవేణి,

మీతో రెండేళ్ల పరిచయంలో మీరు నన్ను ఎంతో ఇంప్రెస్ చేశారు. అది ఎలాగో చెబితే ఇదో ప్రేమలేఖ అయిపోతుంది. మీకు అంగీకారమయిన పక్షంలో మనిద్దరం వివాహం చేసుకుంటే ఇద్దరం ఎంతో సుఖంగా జీవించవచ్చని నేను నమ్ముతున్నాను. మీకిష్టంలేకపోతే లేదని చెప్పడానికి ఏమీ సంకోచించవద్దు. అయినా దీన్ని గురించి ఆలోచించదలుచుకుంటే ఇప్పటివరకూ మీకు తెలియని, నాకు సంబంధించిన వివరాలకోసం పేజీ తిప్పండి. ఇటువంటి విషయాల్లో ఉండే ఆత్రత మీరూహించగలరనుకుంటాను. అందుచేత జవాబు వీలయినంత త్వరలో వ్రాయండి.

సీతారామశాస్త్రి."

కృష్ణవేణి పేజీ తిప్పింది.

"మేము ఇద్దరం అన్నదమ్ములం. ఇద్దరు అక్కచెల్లెళ్లున్నారు. అందరికీ వివాహాలయి కాపురాలు చేసుకుంటున్నారు.

నాకు పదహారేళ్లప్పుడు మా తల్లిదండ్రులు పెళ్లి చేశారు. నా భార్య మహాలక్ష్మికి పెళ్లినాటికి తొమ్మిదేళ్లు. చాలా అందంగా ఉండేది నా కళ్లకు. తన పదిహేనోఏట గర్భంధరించింది. ఆమె పదహారో ఏడు చూడకుండానే ఏ గుర్తు వదలకుండానే వెళ్లిపోయింది. అప్పటికి ఆమెను సహజమైన శరీర వాంఛలతో చూడడమేకాని ఆమెను పూర్తిగా తెలుసుకోవాలనే కుతూహలంగాని, తెలుసుకోగల శక్తిగాని నాకు లేవనుకుంటాను. తెలుసుకోదగినంత ఆమెలోనూ ఏమీ లేకపోవచ్చు. ఏదో వ్రాయాలని ఏదో వ్రాస్తున్నాను.

నా తల్లిదండ్రులు వృద్ధులు. పూర్వాచార పరాయణులు. మాకు స్థిరాస్తి లేదు. నాకు ప్రస్తుతం ఇరవై ఎనిమిది నడుస్తోంది. వివాహం జరిగేక



మీకు ఉద్యోగం చెయ్యాలంటే దానికి అభ్యంతరం ఏమీ ఉండదు. చేయాలని బలవంతమూ ఉండదు. నా తల్లిదండ్రులు ఏడాదికి ఆరునెలలు నా దగ్గిర ఉంటారు. మీలాంటి మనుషులకు వాళ్లెంతో ఆప్తులుగానే ఉంటారు.

ఇక నా జీతం మీకు తెలిసినదే. అదికాక మొత్తం పది పదిహేనువేల చరాస్తిమాత్రం ఉంది.

మరేమయినా వివరాలు కావలిస్తే అడుగితే చెబుతాను.

పి. యస్: మీరు వివాహానికి అంగీకరించడమే నాకిచ్చే కట్నం. అంగీకరించేపక్షంలో మీ కథ కూడా నాకు వినాలని ఉంది.''

వివరాలిచ్చిన విధానానికి కృష్ణవేణికి కొంచెం నవ్వు వచ్చింది. రెండుమూడు సార్లు ఉత్తరం అటు, ఇటు తిప్పి చూసింది. పట్టి పట్టి వ్రాసినట్లున్న దస్తూరీ ఎంతో ప్రయత్నపూర్వకంగా వ్రాసినట్లు చెబుతూంది.

ఉత్తరాన్ని మడతపెట్టి కవరులోపెట్టి మళ్లీ వెనక్కు జార్లబడింది కృష్ణవేణి.

ఒకప్పుడు ఆమె మనస్సు పొగడ్తకు పాలపొంగులా పొంగిపోయేది. దూషణలకు పెనుతుఫానులో సముద్రంలా కలిగిపోయేది. కాని చూస్తూన్న రెండు చక్షువుల ద్వారా, వినగలిగిన రెండు చెవులద్వారా, ముఖ్యంగా ఆలోచించగలిగిన మనస్సు ద్వారా కాలం ఆమె కెన్నో నేర్పింది. క్షణక్షణానికీ రగిలే ఆవేశాన్ని చల్లార్చింది. ఇప్పుడు పెను తుఫాను కూడా కొండలా నిలబడగల విశ్రాంత కలిగింది.

అయినా పొగడ్తలకు అంతగా అలవాటుపడని ఆమె మనస్సు కొంత వంగిన మాట వాస్తవం. అయితే వాస్తవాన్ని మరిచిపోయేంతవరకూ మాత్రంకాదు.

ఈ పొగడ్తలవల్ల ఆమెకు కలిగిందల్లా ఒకటేభావం. తాను ఇక ముందు ఎదురీదవలసిన అవసరం ఉన్నా లేకపోయినా ఇప్పటివరకూ తనకు తాను సాంఘిక పరిస్థితుల్లో ఎదురీది ఒక స్థానాన్ని సంపాదించుకుంది.

అయినప్పుడు గతంలో తన కష్టాలను తలుచుకొని స్వయం సానుభూతిని పొందడం సహజం.

* * *

'మిగిలినవాళ్లందరికీ కొద్దిగా కట్నాలిచ్చినా ఇంచుమించు వాళ్ల మొగుళ్లను వాళ్లే తెచ్చుకున్నారు. దీనికేంచేస్తారో! ఇదా పెద్ద అందమైనదికాదు. నల్లటి నలుపు. కట్నాలుచూస్తే రోజురోజుకు పెరిగిపోతున్నాయి' అనుకున్నారు కుటుంబరావుగారికి ఆప్తులయిన వాళ్లు, కృష్ణవేణికి మేనరికం కుదరలేదని తెలిసి.

ఏడుగురు ఆడపిల్లలకు, ఒక పిల్లవాడికీ తండ్రి అయిన కుటుంబరావుగారు పిత్రార్జితం వెనక నిలబడి నెగ్గుకువచ్చేరు, అప్పటివరకూ.

ఆ రోజుల్లో పెద్ద పిల్లకు మూడువేలు కట్నం ఇచ్చి పెళ్లిచేసేరు. ఆరోపిల్ల దగ్గిరికి వచ్చేసరికి కట్నం పదిహేనువేలు కాగా ముప్ఫైమూడెకరాల ఆస్తి ఎనిమిదెకరాలయింది.

పెద్ద అల్లుడు ధర్మఫారం మూడుసార్లు తప్పి తలపాగా చుట్టిన ముప్ఫై ఎకరాల కామందు. ఆరో అల్లుడు సెంటు పొలంలేకపోగా ఎం. బి. బి. యస్. మూడో సంవత్సరంలో అడుగుపెట్టినవాడు. అప్సరసలు కాకపోయినా ఆరుగురు కూతుళ్లూ అందకత్తెలు కాదనడానికి వీల్లేదు.

స్త్రీకి అందం, పురుషునికి ఐశ్వర్యం ఉన్నా, అందరి సంసారాల్లో ఏదో ఒక అసంతృప్తి తొంగి చూస్తూనే వుంటుంది. మనిషి అవసరాలలో వివాహం ఒకటి కావచ్చు, దానికోసంచేసే త్యాగాలు అవి తెచ్చే సుఖంకన్న ఎక్కువైనప్పుడు దాన్ని వదులుకోవడం మంచిది, లేదా రాజీపడడం మేలు. లేమితో రాజీపడినంత తృప్తి జీవితంలో మరొకటి ఉండదు.

---

కుటుంబరావుగారు తనకు అపురూపంగా కలిగిన వంశోద్ధారకుణ్ణిచూసి, ఆడపిల్లలందరికీ ఉన్నదంతా పెట్టి వీడికేం చేద్దాం అనుకోవడంలోనే, అక్కగారు కృష్ణవేణిని మావాడికి చేసుకుంటాంలే అని ఆసరా ఇచ్చింది. అక్క తన కష్టాన్ని అర్థంచేసుకొని సాయానికి వచ్చిందని సంబరపడ్డారు కుటుంబరావుగారు. ఆ మాట దృష్టిలో పెట్టుకునే ఆయన అడపాతడపా అక్కగారు కష్టాల్లో ఉన్నప్పుడు చేతిలో ఉన్నది సాయం చేస్తూనే ఉండేవారు.

కృష్ణవేణికి పన్నెండేళ్లు నిండగానే పెళ్లిమాట తెచ్చేరు కుటుంబరావుగారు, అప్పటివరకూ పిల్లలందరికీ సమర్తాడకుండానే పెళ్లిళ్లు చెయ్యడంచేత.

''నువ్వేమయినా పైవాడివేమిట్రా! నువ్వే అడుగు, ఒప్పుకోకేంచేస్తాడు?'' అంది అక్కగారు.

డొంకతిరుగుడు బేరం తెలియని కుటుంబరావుగారు మేనల్లుడితో ఉన్న విషయం కాస్త చెప్పేరు. మొహమాట మెరుగని మేనల్లుడు తనకు కృష్ణవేణి నచ్చలేదనీ, ఆమెను సుతరామూ పెళ్ళిచేసుకోననీ ఖచ్చితంగా చెప్పేడు. నచ్చలేదన్న వాడితో మరేం మాట్లాడాలో తెలియక తెల్లబోయి కూర్చుండగానే అతను లేచి పక్కగదిలోకి వెళ్లిపోయేడు. అతని కాలేజి చదువుకు మామయ్య చేసిన సాయం గుర్తుచేయబోయింది తల్లి.

''డబ్బు సాయంచేస్తే డబ్బు తిరిగి తీసుకెళ్లమను. ఈ ఎత్తులేం చెల్లవు. ఆ నల్లమొద్దు నెవడు చేసుకుంటాడు?'' అన్నాడు.

మాటలు మిగలడం ఇష్టంలేక వెంటనే కుటుంబరావుగారు అక్కడనుంచి వచ్చేశారు. భార్య పట్టుదలపై కుటుంబరావుగారు కృష్ణవేణి సమర్తాడకుండానే పెళ్లిచెయ్యాలని విశ్వప్రయత్నం చేశారు.

ఈ విషయాలన్నీ కొంత వయస్సొచ్చేదాకా కృష్ణవేణికేం తెలియవు.

ఒకరోజు సాయంత్రం స్కూలునుంచి పక్కింటి వాళ్లమ్మాయి ద్వారా ఇంటికి పిలుపు వచ్చేసరికి ఆశ్చర్యపోతూ లోపల అడుగుపెట్టింది కృష్ణవేణి.

తల్లి గబగబా లోపలకు తీసుకెళ్లి ముస్తాబు చేయడం మొదలుపెట్టింది. ''ఎందుకే అమ్మా?'' అని అడుగితే ''నీకు పెళ్లివారు వస్తున్నారు'' అంది.

---

యామిని

---

అంతలోనే తనకుతానే ఏదో ప్రాముఖ్యాన్ని అనుభవించింది కృష్ణవేణి.

అమ్మ మెడలో చంద్రహారం తను వేసుకుంది. సిల్కుబట్టల్లో అందరిమధ్యా చాపలో కూర్చుంది. పుస్తకం చదివించేరు. పేరు అడిగేరు. పాటలు పాడించేరు. లేచి లోపలకు వెళ్లమన్నారు.

కృష్ణవేణి ఎందుకో అద్దంలో ముఖం చూసుకుంది. ఇంకా ఇంకా చూసుకోవాలనిపించింది.

మూడు రోజుల తరవాత తండ్రి తల్లికి చెబుతూంటే వింది తను వాళ్లకు నచ్చలేదని.

'ఏడిసేరు. వాళ్లు బాగున్నారేమిటి?' అనుకుంది కృష్ణవేణి. ఇంచుమించుగా ఆ విషయమే మరిచిపోయింది తన ఆటపాటల్లో. కాని ఆ విషయం ఆమెను విడిచిపెట్టలేదు.

తరవాత చాలాసార్లు అలాగే ముస్తాబు కావలసివచ్చింది. ఇంచుమించు అవే మాటలు వినవలసివచ్చింది. దాంతో ఆ ఆలోచన కొంతవరకూ కృష్ణవేణి మనస్సునాక్రమించుకుంది. తరుచుగా తన ముఖం అద్దంలో చూసుకుంటూండేది. ఆమెకు అర్థంకాలేదు తనెందుకు అందరికీ నచ్చటంలేదో. తనకుమాత్రం తన ముఖం అందంగానే కనబడుతూందే?

వీధి చివరివాళ్ల సీతకి పెళ్లి కుదిరిందిట. కట్నం తక్కువగానే ఇస్తూన్నా పిల్లను చూసి చేసుకుంటున్నారుట.

కృష్ణవేణి క్లాసుమేటు సీత. అప్పుడు తెలిసింది కృష్ణవేణికి తనలో లోపమేమిటో. సీతతో పోల్చుకుంటే తాను అందమైనది కానేకాదు. సీతవైపుచూస్తూంటే తనకే ఎంతో బాగుంటుంది. తను నల్లటి నలుపు. పెళ్లిచేసుకొనేటప్పుడు ఏరుకొనే అవకాశం ఉన్నప్పుడు నల్లటి పిల్లనెందుకు చేసుకోవాలి? ఎవరయినా పచ్చనివాళ్లనే ఎన్నుకుంటారు. మరి నల్లటివాళ్లందరికీ పెళ్లిళ్లెలా అయ్యేయి?

కృష్ణవేణి అప్పటినించీ తను చూసిన పిల్లలందరితోనూ పోల్చుకునేది. కొంతమంది ఆమె కళ్లకు నిజంగానే తనకంటే అందంగానే ఉన్నారనిపించేది. కాని చాలా మంది తనకంటే బాగులేనివాళ్ళకూడా ఉన్నారు. తనకే పెళ్లికావడం ఇంత కష్టంగా ఉంటే వీళ్లందరికీ ఎలా అవుతుంది? కృష్ణవేణికింకా పెళ్లి సంబంధాలు వస్తూండగానే వాళ్లల్లో కొంతమందికి పెళ్లిళ్లూ అయ్యేయి. కొంతమందికి కానూలేదు.

ఆ సంవత్సరం సంక్రాంతి సెలవులయ్యేక స్కూలుకు వెళ్లేటప్పుడు కృష్ణవేణి ఓణీతో హృదయాన్ని కప్పుకుంది. తల్లి తొందరపాటు ఎక్కువయింది. అప్పటినుంచి వేసవి సెలవులు వచ్చేవరకూ నాలుగైదు సంబంధాలు వచ్చేయి. ఓ రాత్రి తల్లీ, తండ్రీ మాట్లాడుకుంటూంటే వింది.

''మనమైె అమ్మితామంటే నాలుగైదు వేలకంటే ఎక్కువరాదు ఎకరానికి. పదివేలు కట్నానికయితే ఖర్చులకి నాలుగైదువేలుండాలి.''

''అయితేమాత్రం ఏం చేస్తామండీ! అది ఈవేళారేపో అన్నట్లుంది. ఎప్పుడో బయట కూర్చుంటుంది. అయిన తరవాత చెయ్యడం ఇప్పటిదాకా మనకు ఇంటా వంటా లేదాయె!''

''ఇంక మనమేం తింటాం? లేకలేక వాడొక్కడున్నాడు. వాడికేం పెడతాం?''

**1968. 69 లో మీ అదృష్టము**

ఏదైన ఒక పుష్పం పేరున్ను, మీ చిరునామాయున్ను వ్రాసిన ఒక పోస్టు కార్డు మాత్రం పంపండి. మీకు వచ్చే 12 నెలలలో వ్యాపారంలో లాభ నష్టములు, ఉద్యోగంలో ప్రమోషను, బదిలీ, సంతానం, వివాహం, సౌఖ్యం, మొదలైన వివరములు, దుష్ట గ్రహ వీక్షణలకు శాంతి విధానములతో



పాటు రు. 1.25 పైలకు పంపగలము. పోస్టే జి అదనం. ఒకసారి చూచిన మీకే తెలియగలదు.

**PT. DEV DUTT SHASTRI**
Raj Jyotshi (A.P.W.)
P.B. No. 86, JULLUNDUR CITY







"పోనీ లేకపోతే కొంచెం తక్కువ చదువుకున్నవాణ్ణే చూడండి."

"చూడు! ఈ రోజుల్లో ఆస్తులెవరికున్నాయి? ఇకపోతే స్కూలుఫైనలు చదివితే నాలుగైదువేలు దాటిపోతున్నారు. వాడే ఉద్యోగమైనా చేసుకుంటే కదా వాళ్ళోముద్ద తినేది! ఆస్తిలేక, చదువులేక చూసి చూసి ఎవరికిస్తాం? మనదగ్గిరుంటే కడుపునిండా తిండయినా తింటుంది."

"అయినా చూసి చూసి పెళ్ళిచెయ్యకుండా గుండెల మీద కుంపటిలా ఎన్నాళ్ళు పెట్టుకుంటామండీ?"

కృష్ణవేణికి ఒక కొత్తవిషయం తెలిసింది. తను తల్లిదండ్రులకి గుండెలమీద కుంపటి! ఇది కృష్ణవేణి కలలో కూడా ఊహించని విషయం. అప్పటికప్పుడు తనకు ఎవరూ దిక్కులేరనిపించింది. నిశ్శబ్దంగా పొంగివచ్చిన కన్నీళ్ళతో తలగడ తడిపింది. అయితే ఆ మాటల వెనక ఉన్న పరిస్థితులను అర్థంచేసుకునే శక్తి ఆమెకు లేదు.

దానితో తల్లిదండ్రులపట్ల ఆమె వైఖరి పూర్తిగా మారిపోయింది. గతంలో మెలగినంత స్వేచ్ఛగా మెలగ లేకపోతూంది ఇంట్లో. ఎవరితోనూ గతంలో తీసుకున్నంత చనువు తీసుకోలేకపోతూంది. మాటలుతగ్గాయి. పరిశీలన ఎక్కువయింది. ఏ సన్నివేశంలో నయినా ఎవరు తనమీద ప్రేమ చూపించినా దానికిగల హద్దులు కనబడుతున్నాయి. ఎంతవరకూ లాగితే ఆ ప్రేమపాశం తెగుతుందో అర్థమవుతూంది.

కృష్ణవేణి తల్లి అన్నాళ్ళూ భయపడిన సంఘటన ఆ వేసవిలో జరగనే జరిగింది.

కృష్ణవేణిని అరుగుమీద గదిలో కూర్చోబెట్టేరు. లాంఛనానికి ఏవో జరుగుతూన్నా అంతలోనూ ఏదో అవాంఛనీయమైనది గోచరిస్తోంది. పేరంటానికి వస్తూన్న వాళ్ళతో నవ్వుతూ మాట్లాడుతూన్న తల్లి నవ్వు వెనక ఉన్న అసంతృప్తి, చికాకూ చూసి బెదిరిపోయింది కృష్ణవేణి. క్షమించరాని నేరం చేసినట్లు కుంచించుకుపోయింది.

కాని తండ్రిమాత్రం ఎంతో విశ్రాంతి పొందినట్లు కనబడ్డాడు.

తరవాత అయిదారు నెలలు అసలు ఏ సంబంధమూ చూడలేదు. కృష్ణవేణి స్కూలు చదువు అంతటితో ఆగిపోయింది. దాంతో ఆమెకు రోజు గడవడం మరీ కష్టమయిపోయింది. దేనికి ముందుకు రావాలన్నా ఎందుకో సిగ్గనిపించేది. భయం అనిపించేది. ఇంట్లో అన్నంతినేటప్పుడు ఏదయినా మారు అడగడానికి కూడా అప్పుడప్పుడు జంకేది. ముఖ్యంగా అక్కలెవరయినా ఇంటికి వచ్చినప్పుడు వాళ్ళతో సరిగా మాట్లాడలేకపోయేది. వాళ్ళముందు మసలలేకపోయేది. తనకు తానే ఏవో గోడలు కట్టుకుంది. అయినా దీనికి తనకు తానై చేయగలిగిందేముంది?

కృష్ణవేణిచేతికి ఎక్కువ పనిలేకపోయినా మనస్సుకెపుడూ విశ్రాంతిలేదు. చేసే చేతలద్వారా మాట్లాడే మాటల ద్వారా ఆమె మనస్సు వ్యక్తుల విలువను ఎంచుతూంది.

కాలం గడుస్తూనే ఉంది. ఇదివరకంత కాకపోయినా అప్పుడూ అప్పుడూ ఎవరో చూడడానికంటూ వస్తూనే ఉన్నారు. తాను నచ్చకపోవడమో

లేక వారు కోరింది పరీక్షకి మించింది కావడమో ఏదో ఒకటి జరుగుతూనే ఉంది.

ఇప్పుడు కృష్ణవేణికి పెళ్లి చూపులకు ముస్తాబు కావడం కూడా అవమానంగా తోస్తోంది. ఇది వచ్చిన వాళ్లందరిని మోసపుచ్చడానికేమో అనిపించిందామెకు. రోజూ ఇంట్లో ఉండవలసింది ఇలాగే కదా! దీనికి ముస్తాబులు దేనికి? వాళ్లు నచ్చలేదని చెప్పినప్పుడల్లా మీరేమాత్రం మోసం చెయ్యలేకపోయారని చెప్పినట్లనిపించేది. ఆ ఆలోచన వచ్చినప్పటినించీ ఎవరైనా వస్తున్నారంటే గుండె దడదడ కొట్టుకునేది. వాళ్లు వచ్చి వెళ్లేవరకూ ఆమె మనస్సు అతి సున్నితంగా మారిపోయేది.

ఎన్ని రోజులు గడిచినా ఆమె పరిస్థితి మారలేదు. కృష్ణవేణికి పదిహేడేళ్లు నిండేయి. శరీరం వయస్సుకు తగినట్లు పెరిగింది. కాని ఆమె మనస్సుమాత్రం వయస్సుకు మించి ఎన్నోరెట్లు పెరిగింది.

ఆ రోజు ఉదయం చెంబులు తోముతూంటే కృష్ణవేణి మెదడులోకి మెరుపులాంటి ఆలోచనవచ్చింది. ఆమె మనస్సుకు ఎంతో ఊరట కలిగింది ఆక్షణంలో.

మళ్లీ పెళ్లివారు వస్తున్నారని చెంబులు కడిగి వంట ఇంట్లోకితెస్తూంటే తండ్రి తల్లితో చెబుతూంటే వింది కృష్ణవేణి. ఆ మాట వినగానే మొట్టమొదటిసారిగా ఆమెకు కోపం వచ్చింది. తండ్రి వెళ్ళగానే తల్లిదగ్గిరికి వెళ్లింది కృష్ణవేణి.

"ఈ వేళ నిన్ను చూడడానికి వస్తున్నారట." తల్లి పొయ్యిలోని పుల్లలు తోస్తూ తలతిప్పింది. కృష్ణవేణి తల్లి కళ్లల్లోకి చూసింది.

"ఈ సంబంధాలు చూడడం మానెయ్యకూడదా అమ్మా?"

"అదేమిటే! పెళ్లిచెయ్యకుండా ఉంచుతాముటే?"

"వద్దమ్మా! నేను పెళ్లిచేసుకోను."

తల్లి కోపంగా చూసింది. "అవేంమాటలే?"

"అవునమ్మా! నేను చేసుకోను."

"చాల్లే వెధవమాటలు! నోరు ముయ్యి."

కృష్ణవేణి మనస్సు తిరుగుబాటుతో పొంగింది.

"నిజమేనమ్మా! వాళ్లు చూడడానికి వచ్చినా నేను మాత్రం బయటకు రాను." నిశ్చయంగా చెప్పింది కృష్ణవేణి.

"అవతలికి పో, పిచ్చిగా వాగక! రాకేంచేస్తావ్ గడలా ఎక్కి? [illegible]!"

"ఏమిటే అది?" కుటుంబరావుగారు వచ్చేరు.

"ఏముంది! అమ్మాయి పెద్దదవుతూంది కదూ! ముద్దుముద్దు మాటలు మాట్లాడుతూంది. చిన్నప్పుడు కాకరకాయని పెద్దయ్యాక కీకరకాయ అందిట దీనిలాంటిదే."

కృష్ణవేణి అక్కడనించి లేచివెళ్లిపోయింది. నీళ్లు నిండిన తన కళ్లను తండ్రి దృష్టినుంచి తప్పించలేకపోయింది.

పెళ్లివారి మధ్య కూర్చున్నా ఆ రోజు కృష్ణవేణి దృష్టి పెళ్లివారిమీదలేదు. తన రూపంమీదా లేదు. తల్లీ తండ్రీ కళ్లముందున్నారు. కన్నకూతురి మనస్సు తెలుసుకోవాలనే ఆలోచనే రాదావీళ్లకి ఆచారాలమధ్య? ఆలోచించినకొలదీ ఆమె మనస్సు ఆవేశపూరిత మవుతూంది.

పెళ్లివారు వెళ్లేరు. భోజనంచేసి మడతమంచం మీద పడుకొని తండ్రి పేపరుచూస్తూంటే పక్కకు వెళ్లింది కృష్ణవేణి.

"నాన్నా!" తలవంచుకొని మెల్లిగా పిలిచింది.

"ఊఁ!" అన్నారాయన తల పేపరులోంచి బయటకు తీయకుండానే.

"నేను పెళ్లిచేసుకోను."

ఉలిక్కిపడ్డట్టు పేపరు పక్కకునెట్టి కుటుంబరావు కళ్లద్దాల పైనుంచి చూసేరు కృష్ణవేణివైపు.

"ఏమన్నావ్?"

"నేను పెళ్లిచేసుకోను." ఆమె చేతిలో కాగితం నలిగిపోతూంది.

"మరేం చేస్తావ్?" అన్నారాయన దృష్టి మరల్చకుండా.

"చదువుకుంటాను."

"ఏం చదువుకుంటావు?"

"మెట్రిక్యులేషన్."

"ఎక్కడ?"

"నువ్వే ఎవరినైనా మాస్టర్ని కుదుర్చు."

"తర్వాత ఏం చేస్తావ్?"

"ఉద్యోగం చేస్తాను."

కుటుంబరావుగారు కొంచెంసేపు గుడ్లప్పగించి అలాగే చూసేరు.

"ఎవరు చెప్పేరు నీకిలా చెయ్యమని?"

"ఎవరూ చెప్పలేదు."

"ఆడదానికి చదువెందుకమ్మా?"

ఇంతసేపటికి తరవాత ఈ మాట ఊహించలేదు కృష్ణవేణి. 'పోనీ ఒకసారి తిడితే తిడతారు. తన మనస్సులో ఉన్నది చెప్పెయ్యాలి' అనుకుంది. తెగింపుగా చేతిలోని కాగితం తండ్రికిచ్చి గదిలోకివెళ్లిపోయింది.

కొంచెంసేపు ఆమె వెళ్లినవైపే చూసి కాగితం విప్పేరు కుటుంబరావుగారు.

"అందరిలాగే నాకూ ఎన్నో ఆశలున్నాయి. నాకు ఏవో లోపాలున్నవాళ్లనూ ముసలివాళ్లనూ మీరెలాగూ చూడలేరు. మిగిలిన సంబంధాలు ఎంతెంత ఖరీదుల్లో ఉన్నాయో నా కంటే మీకే బాగా తెలుసును. నాకోసం మీరిప్పటికి అయిదారేళ్లనుండి ప్రయత్నం చేస్తున్నారు. మనకు నచ్చిన సంబంధం మన స్తోమతులో వచ్చేసరికి మరో నాలుగైదేళ్లు పట్టవచ్చు. లేదా అప్పుడూ దొరక్కపోవచ్చు. పోనీ ఎలాగో నాకు పెళ్లి చేసిపంపినా తమ్ముణ్ణి చదివించాలి. ఇంకా ఇంటి ఖర్చులు గడపాలి. ఎన్నాళ్లయినా చేతగానిదానిలా నేనిలా ఎందుకుండాలి? నా కాళ్లమీద నిలబడడానికి నేనెందుకు ప్రయత్నించకూడదు? రోజులు గడుస్తూంటే మనింట్లో ఆచారాలూ సడలుతున్నాయి. అది మారక తప్పదు. ఇప్పటివరకూ మనింట్లో ఆడవాళ్లెవరూ చదువుకోనంతమాత్రాన నేనెందుకుచదువుకోకూడదు? నన్ను కసిరికొట్టక మీరుకూడా ఆలోచించండి. అమ్మతోమాత్రం చెప్పద్దు."

వ్రాత ఆమె వయస్సుకు మించినట్లుగా కనిపించింది కుటుంబరావుగారికి. ముందు నిజానికి కొంత చీకాకు కలిగినా ఆఖరు వాక్యాలు చదివి కొంచెం ఆలోచించేరాయన. ఆయన మనసు కొంత మారింది, ఇన్నాళ్ల వ్యర్థప్రయత్నాలవల్ల. ఇప్పుడు ఇంకా మారింది.

'అవును. కృష్ణ చెప్పినదాంట్లో సత్యం ఉంది. దాన్ని చదివించాలి. అది దానిపట్ల నేను నెరవేర్చవలసిన కనీసపు కర్తవ్యం.' కుటుంబరావుగారు ఒక నిశ్చయానికి వచ్చేరు.

ఎందుకో ఈ విషయంలో ఆయనకు కొన్ని కొత్త ఆలోచనలు వచ్చేయి. 'కృష్ణలో తన మిగిలిన పిల్లలలో లేని గొప్పదనం ఏదో ఉంది. చదువే దానికి తగినది. ఎవరికో ఒకరికిస్తే దానిజీవితం నాశనం చేసినట్లవుతుందేమో!' అలా అనిపించడానికి ఆయనకు కారణం తోచలేదు. కాని క్షణక్షణానికీ అందులో నమ్మకం కుదిరింది.

భార్యకు ఇష్టంలేకపోయినా ఆయన హైస్కూల్లో పనిచేస్తున్న టీచరుద్వారా కృష్ణవేణికి ట్యూషను పెట్టేరు.

రోజురోజుకూ కృష్ణవేణిలో స్థైర్యం పెరిగింది. కనబడని శత్రువు లెవరిమీదో పగతీరుస్తున్నట్లుగా ఏకాగ్రతతో చదివింది. ఆమె చూపుతున్న ఆసక్తి టీచరునెంతో ఆశ్చర్యపరిచింది. కుటుంబరావుగారి



భయము — భక్తి

ఫోటో — మొదిని అప్పారావు (రాజమండ్రి)

మనస్సులో ఏదో సంతృప్తి నిండింది. కృష్ణవేణి తల్లి ఉదాసీనంగా ఊరుకుంది.

కృష్ణవేణి మెట్రిక్యులేషన్ ఫస్టుక్లాసులో పాసయింది. కుటుంబరావుగారు ఆరోజు పేపరుతెచ్చి ఆమెకిచ్చేరు. అలా చూస్తూంటేనే ఆమె కళ్లల్లో నీళ్లు నిండిపోయాయి.

"అదేమిటమ్మా!" అన్నారాయన కూతురి కళ్లల్లోకి చూస్తూ.

"నేను పాసయేను నాన్నా!" అంది కన్నీళ్లతో మెరుస్తూన్న కళ్లతో కృష్ణవేణి. ఆ దృశ్యం ఆయన హృదయంలో దేన్నో స్పృశించింది. ఆయన గొంతు పూడిపోయింది. కళ్లను కన్నీటిపొరలు కప్పేయి.

ఆ సాయంత్రం ఆయన కూతుర్ని "ఏంచేస్తావమ్మా" అని అడిగేరు.

"హైదరాబాదు బావకు ఉత్తరం వ్రాయి, ఏదైనా

ఉద్యోగం చూడమని."

"మెట్రిక్యులేషనుకు మంచి ఉద్యోగం ఏం వస్తుందమ్మా! పోనీ అక్కడికెళ్లి కాలేజిలో చదువుకో. నేను డబ్బు పంపుతాను."

"లేదు నాన్నా. ఏ ఉద్యోగమయినా ఫరవాలేదు. అక్కడ ఈవినింగ్ కాలేజిలున్నాయిట. వాటిలో చేరి చదువుకోవచ్చు. ఉద్యోగం చూడమను నాన్నా!"

ఆమె మాటల్లో తమకు ఏమాత్రం బరువు కాకుండా ఉండాలనే ఆమె ఆత్రుత స్పష్టమయింది. కుటుంబరావుగారికి. ఆయన హృదయం ద్రవించింది. "అలాగేనమ్మా" అన్నారాయన.

ఆయన ఉత్తరానికి జవాబుగా కృష్ణవేణి హైదరాబాదు వస్తేనేకాని సరిగా ప్రయత్నించడానికి వీలుకాదని వ్రాసేడు అల్లుడు.

కృష్ణవేణి హైదరాబాద్ వెడుతుందనగా ఎన్నో సార్లు కళ్లు బాష్పపూరితాలయ్యాయి కుటుంబరావు గారికి. బహుశా తన సంతానం అందరిలోనూ స్వయంగా వివేకాన్ని పెంచుకున్న ఈ నల్లనిపిల్లనే ఎక్కువగా ప్రేమిస్తున్నానేమో ననిపించిందాయనకు.

వెడుతూంటే మూడువందలరూపాయలు కూతురి చేతిలో పెట్టి ఆయనేదో చెప్పాలనుకున్నారు. కాని కృష్ణవేణి ఆయన కళ్లల్లోకి చూస్తూంటే ఆయనకు నోరు పెగల్లేదు.

"జాగ్రత్తమ్మా! అన్నిటికీ తొందరపడక ఏం చేసినా బావనడిగి చేస్తూండు" అంది తల్లి.

కృష్ణవేణి హైదరాబాదు వచ్చిన నాలుగు రోజులకే కుటుంబరావుగారు నోటితో చెప్పలేనిది ఉత్తరంలో వచ్చేసింది.

"కృష్ణా,

ఇంట్లో అందరికీ అన్నీ జరిగినట్లు నీకు జరగలేదు. నీ మనసులో ఎలాంటి ఆలోచనలు వచ్చేవో, ఏం బాధ పడ్డావో నే నెన్నడూ తెలుసుకోడానికి ప్రయత్నించలేదు. ఎటూకాకుండా దిక్కులేనిదానిలా నిన్ను ఇంట్లోంచి తోలేసినందుకు మన్నించమ్మా! పితార్జితాన్ని అమ్ముకోవడం తప్ప మరే ప్రయోజనమూ సాధించలేని అసమర్థుణ్ణి . . ."

కృష్ణవేణి తండ్రిని తలుచుకొని వెక్కివెక్కి ఏడ్చింది. మనుషుల మధ్య దూరం మమతలను ఎంతగా పెంచుతుందో అర్థమయిందామెకు.

బావ డాక్టరు కావడం మూలాన కృష్ణవేణికి వెల తిరక్కుండానే ఓ గవర్నమెంటు ఆఫీసులో ఉద్యోగం


# కేయంపి
## టిల్ ఆయిల్

సీలువేయబడిన 250 గ్రా., 500 గ్రా., ఒక కిలో, 2 కిలో, 4 కిలోల డబ్బాలలో లభ్యంకాగలదు.

ప్రిన్సిపాల్ ఏజంటు: కాలూరాం మహదేవ్ ప్రసాద్, 1, మదన్ మోహన్ బర్మన్ వీధి, కలకత్తా—7. ఢిల్లీలో బ్రాంచి.

టిల్ ఆయిల్ కొనేటప్పుడు




అది స్వచ్ఛంగా వుండేటట్లు కెయంపి వారిదే అయివుండేటట్లు చూసుకోండి.

కెయంపి వారి పరిశుద్ధమైన నువ్వుల నూనె.



# పిల్లి మార్కు
## పాన్ మసాలా పౌడర్

వక్క, తమలపాకులతో, ఇది ఒక చిటికెడు వేసుకుంటే ఏలకులు, లవంగాలు వగైరా ఏవీ అవసరముండదు. అన్ని సుగంధ పదార్థములు దీనిలోనే ఉన్నవి. మీ తాంబూలమునకు సువాసన, రుచి ఇచ్చును.




శాంపిలు వివరముల్లకు వ్రాయండి:

కృష్ణాపుష్కరం ఎగ్జిబిషన్ బహుమతులు:

* బుష్ బెంజో ట్రాన్సిస్టరు
* స్టెయిన్‌లెస్ స్టీల్ టిఫిన్ కారియర్
* స్టీలు ఫోల్డింగ్ కుర్చీ

ఇంకా ఎన్నో బహుమతులు

విజయవాడ కృష్ణా పుష్కరం ఎగ్జిబిషన్ స్టాల్ నెం. 161—B కి తప్పక దయచేసి, బహుమతి కూపనులను పొంది, పై బహుమతులను గెల్చుకొనండి.

అరోమాటిక్ కెమికల్ అండ్ ఆయిల్ కంపెని,

P. B. నెం. 1267 — 7-ఏ, సింగన్న నాయక్ వీధి, మద్రాసు - 1. — ఫోన్: 22099

SWASTIK

